

# శ్రీ భక్తి సంజీవని

ఇది భక్తి జ్ఞాన కర్మయోగములఁ దెలుపు మాసపత్రిక.

ప్రతి హూణమాసారంభంబున వెలువడుచుండును.
విలేఖకుఁడు-ప్రకాశకుఁడు, వావిలికొలను-సుబ్బరావు,
(వాసుదాసుఁడు) ఒంటిమిట్ట.

"భక్తిరేవైనం గమయతి, భక్తి రేవైనం దర్శయతి
భక్తివశః పురుషః ॥" మా. శ్రుతి.
భక్తియే భగవంతుని బొందించును, ఆయనను దర్శింపఁజేయునది
భక్తియే, భగవంతుఁడు భక్తివశుఁడు.



| సంపుటము | 1934వ సంవత్సరము మే నెల | సంచిక |
|---|---|---|
| 6 | భావనామ సం॥ అధికవైశాఖ మాసము. | 5 |



## శ్రీరామానందలహరి

కం. నవనీరద మేచక మై
ప్రవిమలశంపాలతా విభాభాసిత మౌ
పవిశత ధారము నందక
మవు నఘధర భేదనంబు నతుల శివంబు౯.

సర్వత్ర ప్రసవము.

వేదాంతము లక్ష్మయ్య.

ఈయన సంజీవనీ దోషముల నిరూపించుటకై చైత్ర శు ౯ నాఁడు వచ్చెదనని వ్రాసినవిషయము సంజీవని యిది వఱకే ప్రకటించియున్నది.

కొందఱు సమాజసభ్యులును మఱికొందఱు పెద్దమనుష్యు లానాఁటికి వచ్చెదమని వ్రాసినకారణముచేఁ ద్రయోదశి నాఁటికి నలుగురు సాక్షులను దీసికొనిరమ్మని యాయనకు లేఖ వ్రాయఁబడెను కాని అష్టమినాఁడు ప్రొద్దుపొడుచు నప్పటికి నొంటరిగావచ్చెను. ఈయన యింటిపేరు పొడరాళ్ల. బిరుద నామము వేదాంతము, జాతి సాలె, తనమతము అద్వైతము గాదు, ద్వైతముగాదు, విశిష్టాద్వైతముగాదు. ప్రత్యగాత్మ స్వరూపుఁడనని చెప్పెను. ప్రత్యగాత్మకు ముక్కు చెవులు గలవా యని యడుగలేవని బదులు చెప్పెను. నీకో నిరుత్తరమే. ఆయన సంజీవని యం దారోపించిన దోషము లొక పెద్దపుస్తకము వ్రాసితెచ్చెను గాని నాలుగైదు ప్రశ్నలతో కార్యము ముగిసెను.

శ్రీ వాసుదాస స్వామి వారికిని నీతనికిని నీక్రింది సంభాషణము జరిగినది.

**వే. లక్ష్మయ్య :–** హఠయోగ ప్రదీపిక ప్రకారము కుక్కు టాసనమందుండి దంతధావనము చేయుటకు సాధ్యపడదు గదా. కుక్కు టాసనమందుండి దంతధావనము చేయవలసినదని భక్తిసంజీవని వ్రాసెనే అది దోషముగాదా?

**శ్రీవాసు :–** సూర్యగ్రహణము మీ హఠయోగ ప్రదీపిక యందుఁ గలదా?

**వే. ల :–** లేదు.

**శ్రీవాసు :–** ఏజాడ్యమున కేమందో దానియందుఁ గలదా?

**వే. ల :–** లేదు.

**శ్రీవాసు :–** దంతధావనమును గుఱించి హఠయోగ ప్రదీపిక యందేమైన నున్నదా?

**వే. ల :–** నాకుఁ దెలియదు.

**శ్రీవాసు :–** కుక్కు టాసనము ఏసమాసము? ఏశబ్దవృత్తి?

**వే. ల :–** నాకుఁ దెలియదు.

**శ్రీవాసు :–** కోడికిఁ జేతులుగలవా?

**వే. ల :–** లేవు.

**వాసు :–** కోడి కాళ్ళమీఁద నిలఁబడి యుండఁగాఁ జేతుల మీఁద నిలఁబడియున్నట్టు లాసనమున్నదే దీనిని గుక్కు టాసనమని యెట్లుచెప్పెదవు?

**వే. ల :–** ( ప్రత్యుత్తరములేదు.)

**వాసు :–** హఠయోగ ప్రదీపికలో 'వీణా' శబ్ద మేయర్థమందుఁ బ్రయోగింపఁబడినదో యా యర్థమే **"మాణిక్య వీణా ముపలాలయంతీ"** మ్మను చోటను జెప్పెదవా?

**వే. ల :–** ఆయర్థము సరిపడదు.

**వాసు :–** హఠయోగ ప్రదీపికలో గంగా యమునల మధ్య బాలరండను బలాత్కా రముగఁ బట్టుమనిచెప్ప ఁబడినది గదా. నీవట్లేచేసెదవా?

**వే. ల :–** ఆచారమందది కూడదు.

**వాసు :–** నీకు లక్ష్మయ్య అనుపేరున్నదికదా. లక్ష్మి ఆఁడుది అయ్య పుంలింగ వాచకముకదా. ఆఁడుదాని చిహ్నములు నీయందున్నవా? ఆ పేరు నీ కెట్లు సార్థకము?

**వే. ల :–** (నవ్వి యూరకుండినాఁడు).

**వాసు :–** ఏశాస్త్రప్రకారము దంతధావనము చేయవలెను?

**వే. ల :–** ధర్మశాస్త్రప్రకారము.

(కుక్కు టాసనమందుండి దంతధావనము చేయవలసి నదిగా వ్రాయఁబడిన గ్రంథము లాఱింటిని జూపి "సంజీవని శాస్త్రవిరుద్ధముగా వ్రాయలేదుగదా" యని శ్రీస్వామివా రడిగిరి).

**'కుక్కు టాసన'** మని సంజీవనియం దున్నది. మీరు చూపిన ధర్మశాస్త్రములందు నున్నది. ధర్మశాస్త్రము నందలి కుక్కు టాసనమునకు లక్షణము చెప్పఁబడుకుండుట చేత లోకము పొరపాటుపడును అని యాతఁడు చెప్పెను.

నీవు శవాసనమందుండి దంతధావనము చేయుచున్నావా? అని శ్రీస్వామివారడిగిరి. లేదని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

దంతధావన మెట్లుచేయవలసినది లోకమునందుఁ బ్రసిద్ధమయిన విషయము కాన లోకము పొర పాటుపడ నవకాశములేదు. కుక్కు టాసనము. ఇది సంభావనా పూర్వపద కర్మ ధారయము. ఒక పదమునకు నొక శాస్త్రమునఁగల సంకేతితార్థమే సర్వశాస్త్రములందుఁ గలదనుట తప్పు. భిన్న విషయములకు భిన్న శాస్త్రములు.

సంజీవని కుక్కు టాసన లక్షణము వ్రాయకుండుటచే లేవలేని నడుములు విఱిగిన రోగులుతప్ప మఱెవరైన బోరగిలఁ పండుకొనిగాని వెల్లకిలఁ బండుకొనిగాని దంతధావనము చేయువారు గల రేని యిఁకమీఁద వారు కూర్చుండి దంతధావనము చేయుదురుగాక.

**వే. ల :–** రామానుజీయ మంత మోక్షము సంజీవని వ్రాసినది సరియే కాని చక్రాంకనము, ఊర్ధ్వపుండ్ర ధారణము, విగ్రహార్చన సాలగ్రామమును గడిగిన తీర్థము తీసికొమ్మని చెప్పుట సరిగాదు.

**వాసు :–** ఏల?

**వే. ల :–** అవి లింగములు కావున వానికి మోక్షమిచ్చు నధికారము లేదు. ప్రమాణము.

కం. **దండము కాషాయంబున ముండితయుఁ గమండలువును**
**మోక్ష మొసఁగవె । ట్లండేని లింగములకు నఖండజ్ఞాన**
**ప్రదత్వ కలనము గలదే ॥**

కం. **మగువా దుఃఖము శిథిలం**
**బగునని లింగములు దాల్తురమ్మొయి లేదె**
**ట్లు గొడుగు నందుం గావున**
**వగవఁగ మోక్షదముగాఁగ వలయుఁ గొడుగుఁ**

**మహాభార. శాం. 6. 178–179.**

**వాసు :–** ఈ పద్యములందుఁ జెప్పఁబడినవి సన్న్యాసుల విషయమా? భక్తుల విషయమా?

**వే.ల :–** ఇది అందఱకు నన్వయించును.

**వాసు :–** రామానుజ మతమునకు చక్రాంకనము ఊర్ధ్వపుండ్రము అనావశ్యకము లంటివిగదా. నీ వేగ్రంథ ములఁబట్టి చెప్పుచున్నావు.

**వే. ల :–** రహస్యత్రయ సారార్థ సంగ్రహమను గ్రంథమునందు నేను జదియున్నాను. దానినిబట్టి చెప్పెదను.

**వాసు :–** ఆ గ్రంథకర్త యెవరు?

**వే. ల :–** నేను జదివిన గ్రంథమునందు మొదటికాకితములు లేవు.

(ఈ రహస్యత్రయ సారార్థ సంగ్రహము శ్రీవాసుదాస స్వామివారియొద్ద నున్నది. ఇది సంస్కృత గ్రంథము. శ్రీ వేదాంతాచార్యుల వారిచేత వ్రాయఁబడినది. ఇందు మూఁడు మంత్రముల అర్థముకలదు గాని ఊర్ధ్వపుండ్ర చక్రాంకనాదుల విషయ మిందులేదు. తనకు సంస్కృతము రాదని చెప్పిన కారణము చేతను ప్రత్యుత్తరమిడఁజాలక మోసపుమాటలు చెప్పుచున్నాఁడని తెలియుటచేతను వ్యర్థవాదమునఁ గాలహరణముచేయ నిష్టములేకయు ఆగ్రంథ మాతనికిఁ జూపలేదు. ఈగ్రంథ మింతవఱకు నాంధ్రీకరింపఁ బడలేదు. ఇట్టి యాంధ్రగ్రంథము గొల్లాలికొడుకుచేత కుందేటి కొమ్ము కలముతోఁ గాగిదములులేని పుస్తక మందు వ్రాయఁబడినది. అది యచలమత ముద్రాక్షరశాలయందు ముద్రితము కాఁగలదు. వెల అచలషోడాక్షరీ మంత్రమంత. ఆగ్రంథమును బట్టి యీ యాక్షేపము.)

**వాసు :–** లింగము లనావశ్యకము లంటివిగదా నీవేల ముఖమున చిహ్నము ధరించినావు?

**వే. ల :–** నేను ఓంకార చిహ్నము ముక్తినిచ్చునని ధరించుట లేదు. ప్రణవ విచారమువలన ముక్తివచ్చునని ఓంకారము ధరించినాను.

**వాసు :–** ప్రణవ స్మరణమునకు ముఖమున ముద్రకు నేమిసంబంధము? ముఖమున చిహ్నములేనిది స్మరి ంపసాధ్యపడదా?

**వే. ల :–**( ప్రత్యుత్తరము లేదు.) మీరు చక్రాంకనములు చేయుచున్నారుగదా అవి విష్ణుదేవుఁడు ధరించిన వేయని యెట్లు నిరూపింపఁగలరు?

**వాసు :–** విష్ణుదేవుని శంఖచక్రములు తెచ్చి నేను అంకనము వేయుటలేదు. అక్క డకుఁబోయిన మరలివచ్చు

టలేదు.
**వే. ల :–** మీరు వేసెడి శంఖచక్రములు రక్షించునని ఎట్లునమ్మ వచ్చును.
**వాసు :–** శాస్త్ర ప్రమాణమునుబట్టి.

లక్ష్మయ్య జపముచేయుట వ్యర్థమని యాక్షేపించెనుగాని ప్రమాణములు చూపినపిమ్మట జపము పాపహరమని యొప్పుకొనెను. పాపహరమని సన్న్యాసులు ముక్తికై జపము చేయుచున్నారని యంగీకరించెను.
**వే. ల :–** అచలమతస్థులను బాములను గొట్టినట్లు కొట్టవలె నని వ్రాసినా రే యది న్యాయ్యమా?
**వాసు :–** శుద్ధనిర్గుణ తత్త్వ కందార్థముల ప్రకారము వారు నాస్తికులు కావున నాస్తికులను దొంగలవలె పాములవలె నెంచవలసినదిగా గ్రంథములు చెప్పుటచేత నట్లు వ్రాయఁ బడెను.
**వే. ల :–** శుద్ధనిర్గుణ తత్త్వకందార్థములలోని ద్వాదశాక్షర మంత్రమునకు మీరుచేసిన యర్థము సరిగాదు. అది అథర్వణ వేదములోని అనంతోపనిషత్తులోని 'అయంవ్యర్థః బాహ్యః కోఽ పి నభవతి' అనుదానికి తాఱుమాఱుగ వ్రాయఁ బడినది.

నేను దేవుఁడున్నాఁడని ప్రపంచసృష్టిస్థితి లయములు చేయుచున్నాఁడని యంగీకరించువాఁడను. అట్లు దేవుఁడు లేఁడని చెప్పెడివారిని బాములను గొట్టినట్లు కొట్టవలసినదే.

(ఈ యనంతోపనిషత్తు అల్లోపనిషత్తునకు ఏసూపనిషత్తున కావలిది కాఁబోలు. ఇంకను వెలుతురులోకి రాలేదు.)
**వే. ల :–** బ్రహ్మనిష్ఠామతమైన యచల మతమును తాయిగండ మతమని యనవచ్చునా?

దీనికి ప్రత్యుత్తరముగా మహాలయమను గ్రంథమును చూపించి యిట్టివ్రాఁత నీకు సమ్మతమా యని శ్రీవారడిగిరి. ఇట్లు చెప్పుట సరిగాదని యాతఁడనెను.

(ఈ గ్రంథము సంజీవని విమర్శనిమిత్తము వచ్చుటచే దానిని సంజీవని విమర్శించెను గాని సంజీవని ముందు మించి కలహమునకుఁ బోయినదికాదు.)

మీరు అచలగురువులయొద్ద నుపదేశమయినారా యని శ్రీవారి నతఁడడిగెను. అంతటిపాపము నేను చేయలేదని శ్రీస్వామివారు ప్రత్యుత్తర మిచ్చినారు.

ఇట్లు సంభాషించి యతఁడు వెళ్ళిపోవు సమయమందు శ్రీవాసుదాస స్వామి పేర సత్తెనపల్లెనుండి యొక పెద్దపొడుగాటి యుత్తరము రాఁగా ఆ యుత్తర మంతయు నతనికిఁ జదివి వినిపింపఁబడెను. దాని లో ముఖ్యమైనమాటలు.

"ఈ వేదాంతము లక్ష్మయ్యను మే మెఱుఁగుదుము. దేవరవారు వ్రాసిన మాకొండి సమారంభాం పరంపరలోఁ జేరినవాఁడు. అతనిపేరు సంజీవనిలో పడినయెడల తన్మూలమున నేను వారితో వాదించితి ననియు సుబ్బరావుగారు నేను చెప్పినవాదము అర్థముగాక. నేనొకటి చెప్పిన తామొకటి వ్రాసినారనియు పేపరులో తనపేరు పడినందున పామరులతో తన ప్రతిష్ఠకు దానినే ఆధారముగా గైకొని ఆంధ్రవాల్మీకుల వారి నోడించితినని బడాయికొట్టుకొనుటకు సాధనముగా నుండును" ఈవిధముగా మఱికొన్ని విషయములు వ్రాయఁబడెను.

వాస్తవమున నితఁడు పామరులను మోసగించుటకుఁ జాలినవిద్యను గ్రహించినవాఁడెకాని తాను బాగుపడి యితరులను బాగుపఱుచుటకుఁ దగినవిద్య గ్రహించినవాఁడుకాఁడు. ధర్మశాస్త్రజ్ఞానము పూర్ణా నుస్వారము. భక్తిశాస్త్రజ్ఞానము పెద్దసున్న. జ్ఞానలవ దుర్విదగ్ధుఁడు. అయినను నదివఱకు సంజీవని యెఱిఁగిన అచలవాదులలో నితఁడు గుణమున సౌమ్యుఁడుగనే తోఁచెను.

ఇంతయు వాదము జరిగినపిమ్మట నిదంతయు ప్రకటించుటకు ర్పు, 100–0–0 లు పట్టును గావున నిమ్మని శ్రీవాసుదాసస్వామి యడిగెను. తనస్నేహితు లంగీకరించిన యెడల నట్లేపంపెదనని యాయన చెప్పి పోవుచు నమస్క రింపఁగా "సుపుత్రావాప్తిరస్తని శ్రీస్వామివారు దీవించిరి. నాకు కొడుకు పుట్టినయెడల వావిలికొలను సుబ్బరావని పేరుపెట్టుకొందునని చెప్పెను. సంజీవని తనకు విరుద్ధముగా వ్రాసిన యెడల సమదర్శినీ పత్రికాధిపతి తనవాఁడే కావునఁ దానును సంజీవనిని నిందించి వ్రాయుదునని బెదిరించెను. తాటాకుల చప్పుళ్ళకు సింహము బెదరదని యీ వేదాంతి యెఱుఁగఁడు కాఁబోలు. తన కనుకూలముగా వ్రాసినపక్షమునందుఁ దన శిష్యులను వెయ్యిమందిని సంజీవని చందాదారులుగాఁ జేర్చెదనని చెప్పిపోయెను.

ఇట్లాశ చెప్పిన సంజీవని పైవిషయములు వ్రాయకుండునని యతని యభిప్రాయముకాఁబోలు.

ఇట్టి వేదాంతములు నిట్టి వేదాంతులు బయలుదేఱి యంధ్రలోకమునఁ బామరులఁ గాపు కమ్మ

విధవల నుభయలోక భ్రష్టులఁ జేయుచున్నారని సంజీవని మిగుల వగచుచున్నది. ఇన్ని పుటలు దీనికై వ్యర్థముచేయుట తగినపని కాకున్నను నితఁడు అపోహములు చెప్పకుండుటకును నిజమెఱిఁగి యికమీఁద లోక మితనివలనఁ జెడిపోకుండుటకును దీనిని వ్రాయవలసివచ్చెను. ఇతఁడు చెప్పినవన్నియు వ్రాసి యతని చేవ్రాలు తీసికొంటిని. దానినుండి పైవిషయములు సంగ్రహముగా వ్రాసితిని.

వేదాంతము లక్ష్మయ్య యికనైనఁ దనపరువెఱిఁగి తన పాండిత్యము ఓనమాలురాని విధవలముందు అంతకు హీనులగు మగవారియందు ప్రకాశింపఁజేయుచుఁ దృప్తిపడునుగాక యని కోరుచున్నారు.

**యాం. వెం. సుబ్బదాసుఁడు.**

---

## పరివర్తక చరిత్రము.

అనంగా ననంగాఁ బృథుచక్రవర్తి యను నొకచక్రవర్తి యుండెను. ఆయన తనప్రజలు జీవనార్థమై కష్టపడుచుండుటఁ జూచి భూమియందు ధాన్యములు ఓషధు లుత్పత్తిచేయించి వారికి జీవనాధారముఁ గల్పింపనెంచి భూమి రాతిగొట్టుగను మిట్టలు పల్లములుగను నుండుటచూచి ఱాల నన్నిటిని దీసి యచ్చట నచ్చటఁ గుప్పలుపోయించెను. అవే యిప్పుడు గుట్టలని పర్వతములని పేరుపొందెను. కావుననే వానికి శిలోచ్చయములని పేరు. ఇట్లు ఱాలు అప్పలు నెత్తి పాఱవేయించి గుంతలు మిట్టలు సమముచేయించి పైర్లుపెట్టుటకు యోగ్యత గలవిగాఁజేసి చెఱువులు బావులు త్రవ్వించి వాని క్రిందఁగొన్ని సాగుభూము లేర్పాటుచేసి లోకులారా యీ భూములు దున్నుకొని మీరు జీవింపుఁడు. చెఱువు నీళ్ళెక్కు వగా వాడుకొను వారెక్కు వ పన్నులిండు. భూములు చక్క నిస్థితిలో నుంపుఁడు. అని బోధించెను. దానికి రైతులందఱు సమ్మతించి వారివారికిఁ గావలసినంత భూమి వారాక్రమించి ఆ భూములలో నుండు ఱాయి, అప్ప, కంపలు, చవుడులు మొదలైనవి యెత్తి దూరముగఁ బాఱవైచి మాగాణి పల్లపుభూములకుఁ జెఱవునీరు కట్టుకొని వరి మొదలైన పైరులు పండించుకొని యిరుకారు సాగించుచుఁ గొందఱు, నొంటికారు సాగించుచుఁ గొందఱు, నొంటికారు సాగించుచుఁ గొందఱు, చెఱువునీళ్ళు పాఱనిభూములకు బావుల నీళ్ళతో రాగి మొదలైన పైర్లు పండించుకొనుచు బావులులేని పొలములందు నులవ ప్రత్తి లోనగు పైరులు పెట్టుకొని యథాసుఖముగ బహుకాలముగ నిర్విచారముగ జీవించుచుండిరి. స్వయముగఁ గృషిచేయలేని వారు పొలములు లేనివా రున్నవారికి సహాయముచేయుచు వారిచ్చు ధాన్యాదులవలన జీవించుచుండిరి. ఇట్లుండ నొకమహానుభావుఁడు వారియొద్దకువచ్చి రైతులారా! మిమ్ముఁజూచిన నాకుఁజాల దుఃఖమగుచున్నది. మీరెంతో కష్టపడి దున్ని యెరువుపెట్టి నీళ్ళుకట్టి పైరుపెట్టి పండించి తుదకాఫలమును రాజున కిచ్చుచున్నారు. వీఁడు మనవాఁడుకాఁడు. అతఁడు దానినిఁ దనయింటిలో నుంచుకొని సుఖించుచు న్నాఁడు. ఇది చాలఘోరకార్యము. మీకొక యుపాయము చెప్పెదను. ఈరాజుతో మీకు సంబంధములేకుండఁ జేసెదను. అతని యధికారమునకు మీరు లోపడవలసిన పనిలేదు. మీరు స్వతంత్రులుగానుండు నుపాయము చేసెదను. మీరిచ్చు పన్నులతోఁ గదా రాజు భోగ మనుభవించుచున్నాఁడు. ఆయనకాని యాయన బంధువులు కాని సిద్ధము చేసిన వస్తువుల దేనిని గొనవలదు. అట్లయిన నతఁడు సంధికి వచ్చును. అప్పుడు మీరు స్వతంత్రులై యుండవచ్చును. అని బోధించెను.

ఆ రైతులలో దూరాలోచనము లేనివారు కొందఱు తమబల మెదుటిబలము నాలోచింపలేక బేష్ బేష్ మంచి యాలోచన యని కేకలు పెట్టుచు నతఁడు చెప్పినట్లు చేసిరి. మీకు స్వాతంత్ర్యము సంవత్సరము నకు, ఆఱు నెలలకు, మూఁడు నెలలకు, నెలకు, పదిదినాలకు, వచ్చె వచ్చె. పొగబండి మీఁద వచ్చె. శామలకోటకు వచ్చినది పిఠాపురమునకు వచ్చుటే తరువాయి. అదిరాఁగానే దానికి రుసుముకట్టవలెను. తెండు తెండు కోటిరూపాయలని వారివలన రాఁబట్టి ఛూమళయాళ భగవతీ ఓడివా ఓడివా యని యంతయు దమ్మిడి మిగులకుండ మాయముచేసెను. పదునాలుగు వేలు మాత్రమతని పుట్టినదినము పండుగునకు వెచ్చపడెను.

ఈపరివర్తకుఁడు మంచిమాటలచేఁ దన ప్రజలకు రాజ్యమిచ్చి నీవు నెత్తిపై ముసుఁగు వేసికొని పొమ్మని రాజుతో చెప్పెనుగాని బాగుగఁ దినమరిగిన యారాజది యంగీకరింపఁడయ్యెను. ఈ మహానుభావుఁ డు కల్లక పట మెఱుఁగనివాఁడు. ఆకారణమున రాజులతో వ్యవహారమాడునపుడు కావలసిన సామదానభేద దండ మాయేంద్రజాలాది యుపాయము లెఱుఁగఁడు. రామాయణమందుఁ గైక చేసినయుపాయము మనము చేసి యామెవలె సాధింప వచ్చునని తలఁచి యుపవాసముల నాశ్రయించెను.

సామదాన భేద దండ మాయోపాయములు తెలిసినవాఁడను బలశాలియునగు నారాజు మంచిమాట లచేఁ గొందఱను, బిరుదులు ధనములిచ్చి కొందఱను, వారిలోవారికిఁ గల హామీలుపెట్టి కొందఱను, జనులను తనస్వాధీనపఱుచుకొనెను. తనకు విరోధించి నర్తించినవారిని దండనీతి ననుసరించి తలలు పగులఁ గాళ్ళుసేతులు విఱుగఁగొట్టించెను. ఈ విధముగ నెందఱో సుఖజీవనము చేయుచుండినవారు ఆ మహానుభావుని మాటవిని దెబ్బలుతిని తినఁగూడు కట్ట బట్టలేక యల్లాడుచుండిరి. ఈ యుపాయము నిష్ఫలమగుటయుఁ బ్రజలకుఁ దనయందు గౌరవము తప్పుటయు నాలోచించి యా రైతులయొద్దకుఁబోయి మీయం దైకమత్యము లేకుండుటచే స్వాతంత్ర్యము మరల వెనుకకుఁ బోయినది. మీ భూములను మీరు చక్క ఁగా నుంచుకొనినవారుకారు. మీరుకొన్ని భూములు మిట్టగాను గొన్ని భూములు పల్లముగా నుంచు కొనిన పరమపాపులు. మీకు సమత్వములేదు. ఇఁక నట్లుండరాదు. అన్ని భూములు సమానముగా నొకమట్ట మున నుండవలెను. కొన్ని భూములు పైరులే లేకయున్నవి. కొన్ని భూములయందు వరిపండుచున్నది. ఈ పక్షపాతము మీకేల? ఇది మహాపాపముగదా. మీరు పిశాచములు. అనేకములు పడగలుగల కాలసర్పమువంటి రాక్షసులు సైతానులు అని బోధించెను.

**రైతు :–** అయ్యా! యీ భూములు చిరకాలముగ మనుమాంధాతలు మొదలు నిట్టులే యున్నవి. మేము చేసినవి కావు.

**మహానుభావుఁడు :–** అది నాకుఁదెలియును. మీరుపాపులే, మీయబ్బలు పాపులే, మీతాతలు ముత్తాతలు పాపులే. వారి తాత ముత్తాతలు మీరుచెప్పిన మనుమాంధాతలు ధర్మరాజు లోనగువారు సృష్టిమొదలు నేటి వఱకందఱు పరమపాపులే. మీరు భూముల నిట్లుంచిన కారణముచేతనే భూకంపమువచ్చి కొంతదేశము పాడైనది. మెక్సికోలో నట్లేయైనది. జపానులో గతసంవత్సరమున పదిటిలో 22000 మార్లు భూకంపము వచ్చెను. 1922 లో 99300 చచ్చిరి.

మీ పాపమువలననే యన్యదేశములందును దేశక్షోభము గలుగుచున్నది. మీ పాపమువలననే అన్యదేశము నుండి బియ్యము మనదేశమునకు వచ్చి మనబియ్యము వెలలు తగ్గినవి. మీ పాపమువలననే సూర్యచంద్రగ్రహణములు. మీ పాపములవలననే విపరీతవర్షములు. ఇంతయేల మీ పాపమువలననే బిడ్డలు పుట్టి కొందఱు, పుట్టక కొందఱు, పెరిఁగి కొందఱు పెరుఁగక కొందఱు చచ్చుచున్నారు. ఇంతయేల? మీ పాపమువలననే యనేకు లజీర్ణవ్యాధిచే బాధపడుచు మలవిసర్జనము చేయలేకయున్నారు. ఇంతకు మీయందు సర్వసమత్వము లేకపోవుటేకారణము.

ఇప్పుడు ప్రాయశ్చిత్తము పెట్టుకొని యా భూముల యొద్దకుఁబోయి చెంపలు వాయించుకొని సాఁగిలఁబడి దండము పెట్టి ప్రార్థించి వానిని మీ భూములతో సమానముగఁ జేయుఁడు. అట్లుచేయకపోయితి రా మరల భూకంపము వచ్చిన మీరు నాశమగుదురు. కఱవులు, అజీర్ణవ్యాధులు హెచ్చును.

**రైతు :–** అయ్యా! మీకిష్ట దేవతయైన శ్రీరామచంద్రమూర్తి కాలమందుఁగూడ సాగుభూములని చవుళ్ళని రాతిగొట్టులని యుండినవే. మీకిష్టమైన భగవద్గీత చెప్పిన కృష్ణమూర్తి కాలమందు నుండినవే.

**మ :–** అది నాకుఁదెలియును. వారిరువురు నీవిషయమునఁ బరమపాపులే పిశాచములే.

**రైతు :–** అయ్యా! యవిమిట్టలు, చవుడులు, ఱాతిగొట్టులు పైర్లుపండవు. నీళ్ళుపాఱవు.

**మ :–** ఏల పాఱవు?

**రైతు :–** తూముపల్లము, ఆభూములు మిట్ట.

**మ :–** అట్లైనఁ జెఱువుకట్ట తెగఁగొట్టుఁడు. అప్పుడు చెఱువు నీళ్ళు భూములకన్నిటికి సమముగఁ బాఱును.

**రైతు :–** అయ్యా! యా భూములు గడ్డతీరుదీసి మాభూములతో పాటు సమముగఁ జేయుఁడు. అప్పుడు చెఱువునీళ్ళు పాఱును.

**మ :–** అది వచ్చు కార్యము. అదిసరిపడదు. మూఁడు నెలలలో గాదుకదా. నెలలో సర్వము సమ మైపోవలయును. మీ భూములలోని ఱాలు కంపలేగదా యివి. వానిని దెచ్చి మరల మీరే మీ భూములలోఁ బోసికండు.

**రైతు :–** మీ రేమైన సహాయము చేసెదరా?

**మ :–** ఆహా – మీరు ముందుచేయుఁడు. నాకుఁ గోటిరూపాయలిండు, మీపెండ్లాలమీఁది బిడ్డల మీఁది సొమ్ములు తెండు, నాకిండు లెండు లెండు తేఁబొండు. ఊఁ ఊఁ పొండు ఆలస్యములేదు.

**రైతు :–** మహానుభావా! పూర్వమునేల ఱాలతో నిండి గుంటలు మిట్టలుగా నుండఁగాఁ బృథుచక్ర వర్తి

ఊాలనన్నిటిని గుప్పత్రోసె ననియు నవియే శిలోచ్చయములు, పర్వతములు, గుట్టలయ్యెననియు నేల చదరమై సాగున కుపయోగపడు ననియు భాగవత హరివంశాదులం దున్నవే. ఇప్పుడు ఊాలను మరల భూమిమీఁదఁ బరువవలయు ననుచున్నారే.

**మ :–** ఆయనకు భూమిమీఁద ద్వేషము కావున నట్లుచేసెను. భూమి గోవై పరువెత్తఁగాఁ గ్రూరుఁడై స్త్రీయనక గోవనక చంపఁజూచినట్లు లాగ్రంథములందే లేదా? దాని వలన నాయన భూమికి అనఁగా లక్షణచే భూజనుల కందఱకు విరోధియని తెలియలేదా. ఆయన పరమపాపి, దయ్యము, పెక్కు తలల కాలసర్పము రాక్షసుఁడు. సైతాన్.

**రైతు :–** మహానుభావా! మనకు స్వతంత్ర రాజ్యము వచ్చిన నప్పుడు మాస్థితి యెట్లుండునో చెప్పెదరా?

**మ :–** ఆహా చెప్పెదను.

అన్ని విషయముల నందఱు సమానులే. ఒక రెక్కు వ మఱియొకరు తక్కు వ యనుజ్ఞాన ముండదు. మమకారము సర్వానర్థకరము కావున నాదియను వస్తువుండదు. అంతయు నందఱిది. ఒకఁడుపేద, మఱియొకఁడు ధనికుఁడు, ఒకఁడు రాజు, మఱియొకఁడు సేవకుఁడు. అను భేదముండదు. భూములకు పట్టాలులేవు. ఏభూమి యెవఁడైన దున్నవచ్చును. హెచ్చుగఁ బండించుకొన్నవారు హెచ్చుగ ధనమార్జించిన వారు నవి లేనివారికి నియ్యవలెను. ఇంతయేల నాసొత్తు అనునది నేను గొప్ప యనునది లేదు.

**రైతు :–** అయ్యా! భార్యలో;

**మ :–** వారును నంతే – భూములవలెనే భార్యలు. రెండును క్షేత్రములేకదా. పెండ్లాము (pendulam) పెండ్లాము ఒకచోట నిలిచియుండునా? భరించువాఁడే భర్త, ఎవఁడైననేమి? ఇంతయేల సర్వ స్వతంత్రత, సర్వ సమత్వము మనస్వతంత్ర రాజ్యలక్షణము.

**రైతు :–** మేలు మే లీ యాలోచన బాగున్నది. ఆహా యేమి నిష్పక్షపాతిత్వము, ఏమి త్యాగము, ఏమి సమత్వము. అని మెచ్చుకొనుచుఁ గొందఱు దమకుఁగలది సమర్పించిరి. ఆఁడువారును దమ నగలను వారి పాదములపై నుంచి నమస్క రించిరి.

ఒకతె తల్లితో నమ్మ నాయొద్ద నేమియులేదే. ఈ మహానుభావునకు నా మంగళసూత్రము సమర్పింతునా?

**తల్లి :–** నీ తల పుండుపగుల మంగళసూత్రము త్రెంచితే మగఁడు చచ్చునే.

**కూఁతు :–** మగని కేమిలేవే. వీఁడుపోయిన నింకొకఁడు వాఁడు పోయిన మఱియొకఁడు వచ్చును. సంఘ సంస్క రు లెందఱో యేకారుచున్నారు. నాకేమి. ఎట్టని తోలులేదా! ఒంటిలోఁ గండలేదా? ఒక కన్నుసైఁ గతో నూఱుగురు కామదాసులను నా గోఁచివెంటఁ బరువెత్తునట్లు చేయలేనా? మెడలకుఁ ద్రాళ్ళుగట్టి క్రోఁతి పిల్లల నాడించినట్లు ఈ మగవారి నాడింపలేనా. ఒక చిఱునవ్వు, ఒక కన్ను సైగ, ఒక యాలచాలు. ఇట్టి మహానుభావుఁ డెందుండి వచ్చునే. పశువులకు మెడతలుగులవలె మనకేటికే యీ మెడత్రాళ్ళు?

**తల్లి :–** నా తల్లికదే! యెటువంటిదానవు పుట్టినావే. నా కడుపున.

**మఱఁదలు :–** వదినే – నీ చెవులలో సీమకమలాల కమ్మలుండెనే ఏమైనవే.

**వదినె :–** బండి లాందరలవలెఁ గమ్మలేటికే చెవులకు? వికారము కావున వానిని మహానుభావునకు నిచ్చితినే.

**చెల్లెలు :–** నీ ముక్కు లో ముక్కు పోగుండెనే యేమైనదే అక్కా .

**అక్క :–** దోఁటివలె నున్నదని తోఁచి మహానుభావున కిచ్చితినే.

**భర్త :–** (My Dear Love !) మై డియర్ లవ్. నీచేతి బంగారు కడియాలు గొలుసులేవి?

**భార్య :–** మహానుభావున కిచ్చినాను.

**భర్త :–** నీకో.

**భార్య :–** నీవు నాకు మరల నట్టివి చేయించువఱకు సత్యాగ్రహము. ఇప్పుడు గ్రామములో నాఁడువారు మగవారు నన్నెంత మెచ్చుకొనుచున్నారో విచారించిరా. పేపరులలో నా పేరుపడినదే.

**భర్త :–** Coming events cast their shadows before భవిష్యచ్ఛాయలు ముందుగానే మీయందు వ్యాపించుచున్నవి.

**ఇది పరంపరారూపకము.**

## వాసుదాసు విన్నపములు.

(గతసంచికాశేషము 162వ పుటచూడు.)

**32**. ఓరీ! నీవు చెప్పినట్లు చూచిన గుట్టమిట్ట, నందిపంది, ఎద్దు మొద్దు లోనైనవెల్ల నేనేకావలయును. లోకమున నొక పదార్థమువంటిది వేఱొకటి సజాతీయమందుఁగాని విజాతీయమందుఁగాని లేదుగదా. ఇన్నిటియందు రూపభేదములు, నామభేదములు గుణభేదములు కలవుగదా. ఇన్ని భేదములు నాకుఁ గలవా యందువేమో? సర్వశరీరా! క్షమింపుము. కంటికిఁ గానవచ్చు సర్వపదార్థములు నీ ప్రకృతివిగాని సాక్షాత్తు నీవికావు. నీ ప్రకృతినే మాయ యని యవిద్య యని యందురు. ఈ ప్రకృతి నీయొక్క భూతశక్తి, అదియచేతనము, స్వయముగ నేకార్యము చేయఁజాలదు. కావున దాని యందు నీవు జీవరూపమునఁ బ్రవేశించుటచే నీ సంకల్పశక్తి వలన నది యిన్ని రూపములుగా మాఱఁగలిగెను. నాయాత్మ నాదేహమున కెట్టిదో నీవీప్రపంచమున కట్టివాఁడవు. నాయాత్మ వెలుపలికిఁ గానరాకుండఁ జేయునది నాశరీరముకదా. అట్టులే నిన్ను వెలికిఁ గానరాకుండఁ జేయునది నీ శరీరమైన ప్రకృతి. అది నిన్ను మఱుఁగుపఱుచుచున్నది. అదియైనను నీశక్తియగుటచే నీ సంకల్పానుసారము ప్రవర్తించుచున్నది గాని నిన్నుఁగాదని స్వతంత్రశక్తి కలిగికాదు. నాటకమం దొకఁడే పెక్కు ఉడుపులు ధరించి పెక్కు రూపములఁ గానవచ్చునట్లు నీవును బ్రకృతియను నుడుపులు ధరించి పెక్కు విధములఁగాన వచ్చుచున్నావు. ఈవిధముగ నీ స్వసంకల్పముచే యథాస్థితిగా నీవు మాకుఁ గానరాకున్న వాఁడవుగాని నిన్నుఁగాదని మఱియొకటివచ్చి నిన్ను మఱుఁగుపఱుప లేదు. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా శ్రీ రామచంద్ర ప్రభో నమోనమః.

**33.** ఓరీ! నీవు ప్రకృతి యచేతనమంటివి, నేను జ్ఞాతనంటివి, సంతోషమే. అట్లైన నీవలెఁ గాసే పేదృవాఁడను కాసేపు నవ్వువాఁడను నేనేకదా మీ సుఖదుఃఖములన్ని నావేకదా. నా కేగ్రహచారముపట్టి యీ దుఃఖములు గలుగుచున్నవో చెప్పెదవా యందువేమో. నారాయణ నారాయణ కోపింపకుము. స్వామీ! కోపింపకుము. ఈ సుఖదుఃఖములు నిన్ను బాధింపఁజాలవు. ఏలన సుఖదుఃఖములు కర్మఫలములు. సత్క ర్మముచేసి దానిఫలము ననుభవింపఁ గోరిన సుఖము వచ్చును. దుష్క ర్మము చేసిన దుఃఖమువచ్చును. నీ వేకర్మ ఫలముగోరి చేయవు. కావునఁ బ్రకృతిసంబంధములైన సుఖదుఃఖములు నీకు లేవు. ప్రకృతిగుణము లైన సత్త్వము రజస్సు తమస్సు అనువానికి వశపడి కర్మములు చేసిననే సుఖదుఃఖములు గలుగును నీవు ప్రకృతికి నతీతుఁడవుగాని ప్రకృతికి వశుఁడవు కావు. అది నీకు వశపడి నీవు కోరినట్లది ప్రవర్తించుచున్నది కాని యదిచెప్పినట్లు నీవు నడుచుకొనుటలేదు. నమో నమో ఏకశిలావాసా పాలిత వాసుదాసా శ్రీ రామచంద్ర ప్రభో నమోనమః.

**34.** ఓరీ! అచేతనమైన ప్రకృతికి సుఖదుఃఖములు లేవాయె. చేతనుఁడనైన నాకును లేవాయె. అట్లైన నీసుఖదుఃఖము లెవరికందువా? జగన్నాటక సూత్రధారీ! నా యభిప్రాయము చెప్పెద వినుము. ప్రకృతిపరిణామమైన యీ దేహమందు నీ వుండినను “ఈదేహమునాది, నే నీపుణ్యకార్యములు చేయుచున్నాను, నేను భోగించుచున్నాను, నేను ధనముసంపాదించెదను, నేను దినుదును, పదిమందికిఁ బెట్టుదును, నేను బలము సంపాదింతును, ఒకరిని గొట్టెదను, మఱియొకరని మొట్టెదను, నేను విద్యసంపాదింతును, ప్రతివాదుల గెల్చి కీర్తిసంపాదించెదను” అని యిటువంటికోరికలు నీకులేవు. తామర పాకునందలి నీటిబొట్టువలె, బురద యందలి కుమ్మరపురువువలె, నాలుక జిడ్డువలె, గ్రచ్చకాయ బూడిదవలె నంటి యంటక యున్నాఁడవు. నీవుగాక యీ దేహమునందు మఱియొకఁడు కలఁడు వాఁడే ప్రకృతి బద్ధుఁడై గుణములకు వశపడి గుణానుసారముగఁ గర్మములు చేయుచుఁ గర్మఫలముల ననుభవింపఁ గోరుచుండును. వాఁడు స్వకృత కర్మఫలము లనుభవించువాఁడు. సుఖదుఃఖానుభవములు వానికిఁగాని నీకుఁగాదు, ప్రకృతికిఁ గాదు. ఈ సుఖదుఃఖము లనుభవించువాఁడే జీవుఁడు. నమో నమో ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**35.** ఓరోరీ! వీఁడెవఁడురా? వానలేని వట్టిపిడుగు వలె నడుమ దూఁకినాడు. వీఁడెవఁడు, ఎక్క డనుండువాఁడు, ఎక్క డనుండి వచ్చినాఁడు. ఇటులే యిఁక నెంతమందిని దెచ్చెదవో చెప్పరా యందువేమో? ఆత్మేశ్వరా! చెప్పెద వినుము. వీఁడెవ్వఁడో యెక్క డనుండియో రాలేదు. అగ్నిహోత్రమునందు వెలుతురు గలిగించుశక్తి కాల్చుశక్తి యున్నట్లు నీయందుఁ గల శక్తులలో నచేతనశక్తి ప్రకృతి యనఁబడుచున్నది. చేతనశక్తి జీవులయ్యెను. సూక్ష్మదశయందుఁగాని స్థూలదశయందుఁ గాని యివి నిన్ను వదలియుండవు.

వెలుతురు దాహశక్తి లేకున్న నగ్ని యెట్లులేదో యట్టులే యీ చిచ్ఛక్తియచిచ్ఛక్తి (జీవుఁడు ప్రకృతి) లేకున్న నీవులేవు. ఈ రెంటికి నీవే యాధారము. సాలెపురుగు తనలోనుండి తంతువులు వెడలఁదీసి గూఁడు కట్టునట్లు నీలోనున్న నీశక్తియగు ప్రకృతిచే నీ ప్రపంచ స్వరూపము నేర్పఱిచితివి. అది జడము కావున నేకార్యము చేయలేక యుండఁగా వానిలో జీవునిఁ బ్రవేశపెట్టితివి. ఏయే జీవుఁ డేయేఫలముఁ గోరి యేయేకర్మములు చేసెనో యాయా ఫలము లాయాజీవి యనుభవించుటకుఁదగిన దేహము గలిగించితివి. జీవుఁడు దేహములోఁ బ్రవేశించినన దాను గోరిన ఫలము లనుభవించుటకుఁ గావలసినవన్ని సంపాదించుకొనఁ దెలియనివాఁడగుటచే వానిలోఁ బ్రవేశించియుండి నీ విది యిట్లుచేయుము అది యట్లుచేయుమని ప్రేరించి, వానిచేత నా కార్యములు చేయించి, దానికిఁ గావలసిన సామగ్రి సమకూర్చి కార్యము సఫలముచేసి వానికోరిక నెఱవేర్చి దానిఫల మనుభవింపఁ జేయుదువు. జీవుఁడు నీయంశమేకాని నీకంటె భిన్నుఁడుగాఁడు. నిన్ను విడిచియుండువాఁడును గాఁడు. వానిని విడిచి నీవుండలేవు. గుణమును విడిచి గుణియుండఁగలదా? గుణిని విడిచి గుణముండఁగలదా? సూర్యునివిడిచి యెండ యుండఁగలదా? తెలుపునువిడిచి పాలుండఁగలవా? తీపును విడిచి బెల్లముండఁగలదా? జీవుఁడు ప్రకృతి నీయంశములు. నీవంశివి ఇవి క్రొత్తవస్తువులు గావు. నీకంటె భిన్నములుగావు. శక్తి శక్తునికంటె భిన్నమా? అయినను నెఱ్ఱవస్త్ర మనినపుడు వేఱువేఱుగా దృష్టించితిమేని ఎఱుపువేఱు వస్త్రమువేఱు, ఎఱుపు వస్త్రముగాదు. వస్త్రము ఎఱ్ఱకాంతికాదు. అప్పుడు రెండుగాఁ జూడఁబడును.

ఎఱ్ఱవస్త్రము కొనుమన్నప్పుడు వస్త్రమునకుఁ బ్రాధాన్య మిచ్చుటచే ఎఱుపు విశేషణముమాత్ర మగుచున్నది. వస్త్రము నేఁతయెట్లున్నది, నూలెట్టిది, ఎన్నిమూరలున్నవి. అని వస్త్రమును బరీక్షించునపుడు వన్నెను శోధింపము. రంగు బాగున్న దాలేదా? దృఢముగ నుండునా యుండదా? యని పరీక్షించునపుడు వస్త్రమును గమనింపము. అట్టులే మనస్సంతయు నీ మీఁదనుండెనా నా కీ దేహముండుటయే కాదు. మనస్సుండుటయుఁ దెలియదు. దేహముమీఁద నా మనస్సుండెనా నీవు కానరావు. నీ మీఁద మనస్సుండెనా భ్రమరకీట న్యాయమున నీవలె నగుదును. దేహము మీఁద మనస్సుండెనా ప్రకృతియను సుడిగుండములోఁబడి మునుఁగుదును. కావునఁ దండ్రీ యీ బిడ్డమనస్సు సర్వదా నీమీఁద నుండునట్లనుగ్రహింపుము అట్టి కార్యములందే నియోగింపుము. అట్టి పుస్తకములే చదువనిమ్ము. అట్టి విషయములే మనస్సునకుఁ దెమ్ము, అట్టిసహవాసులే దొరకనిమ్ము, ఈ యుపకారమునకు బదు లొక నమస్కా రముదప్ప మఱియేదియుఁ జేయఁ జాలను. నమో నమో ఏకశిలావాసా పాలిత వాసుదాసా శ్రీ రామచంద్ర ప్రభో నమోనమః.

**36**. జనకా! రామచంద్రప్రభూ!! నేను నిన్నొక ప్రశ్న యడిగెదను కోపింపక ప్రత్యుత్తరమిమ్ము. నన్ను నీవేలసృజించితివి. నన్ను నీవు సృజించినపుడు నీలోనుండి నేను బయలు వెడలినప్పుడు నేను నీకుఁ బుత్రుఁడనేకదా. ఈ విధముగఁ తండ్రివైన నీవు నీకొడుకగు నన్ను లాలించి బేలించి ముద్దులాడి సుఖపెట్టవలయునా? కల్పములకొలఁది నన్నిట్లు జన్మముల పాలుచేయవలయునా? ఇట్టి నీవు దయావంతుఁడ వెట్లయితివి? ఇట్టినీవు దయాశాలివేని నిఁకఁ గ్రూరులెట్టివారు? ఎంతటి క్రూరుఁడైనను నింతదీర్ఘకాలము బాధించునా? ఏమీ! ఏమీ!! పరాశర బాదరాయణులు చెప్పినది స్మరింపుమనెదవా? స్మరించితిని. సర్వసంపత్తులుగల చక్రవర్తి చెండుతో నాడుకొనునట్లు జీవకోటితో నాడుకొనుచున్నావని చెప్పిరి. వారు నీవారగుట నిన్నుఁ బ్రత్యక్షముగా దిట్టఁజాలక పరోక్షముగఁ దిట్టిరని నాయభిప్రాయము. ఏలందువా? చక్రవర్తి నూతనానందా నుభవముఁగోరి యున్నవానితో సంతుష్టిపడక యీ విధముగఁ గాలము వ్యర్థము చేయుచున్నాఁడు. నీ విషయము కొంతయైనఁ దెలిసిన నేను నీవట్టిసోమరివని యెట్లు చెప్పఁగలను. నీ వనేకకోటి బ్రహ్మాండములను సృష్టించితివి. సృష్టించుచున్నాఁడవు, సృష్టింపఁగలవు, రక్షించితివి, రక్షించుచున్నాఁడవు, రక్షింపఁగలవు, సంహరించితివి, సంహరించుచున్నాఁడవు, సంహరింపఁగలవు. ఒక లవమాత్రము కాలమైనను నీవీ కార్యములు చేయక యూరకుండునదిలేదు. 'సర్వదా నీవు కార్యము చేయుచునేయుందువు. యోగనిద్ర యనునది నిద్రారూపకమైన యోగమేకాని నావలె మొద్దువలె దేహమెఱుఁగక పడిపోవుటకాదు. నీవలె నేను బనిచేసిన నొకనాఁటికిఁ జత్తును. కావున నీవుసోమరివికావు. క్రియాశక్తి నిన్నూరక యుండనీయదు.

ఇఁక నానందమే నీరూపము. లోకములోని యానందములన్ని కలిపినను నీయానందమునఁ గోటవ భాగమునకు సరిగాదు. నీయందు లేనిది నీవు క్రొత్తగా సంపాదించు నానంద మెట్టిదో నాకుఁ జెప్పుము. లేనిది క్రొత్తగా వచ్చినఁగదా క్రొత్తయానందము. నీ కిదివఱకు లేనిదేది? క్రొత్తగా వచ్చునదియేది? ఏ క్రొత్తవస్తువు నీకే క్రొత్తయానందము కలిగింపఁ గలదు. కావున నావలననీవొక యానంద మనుభవించు

చున్నావనుట నేను నమ్మఁజాల, బిడ్డల నాడించుచుఁ దండ్రులు సంతోషించుట లేదా యందువా? పిల్ల వాండ్రను సంతోషపెట్టి వారి సంతోషమే తమసంతోషముగా నెంచువారుగలరు. నీవట్టివాఁడవు కావు. అట్టివాఁడ వైనచో మమ్ము సంతోషపెట్టి నీవు సంతోషపడుదువుగాని మమ్ములను దుఃఖపెట్టియా నీవు సంతోషపడుట? కొందఱు పురుషులు బిడ్డలముడ్డిగిల్లి యేడిపించి సంతోషింతురు. నీవునట్టివాఁడవా? నమో నమో ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**37.** ఓరీ! వాఁగుఁబోతా! నేను మిమ్ము సృష్టించుట మీ మేలునకే కాని నా మేలునకుఁగాదు. దుఃఖ మిశ్రముగాని శాశ్వతమునైన యానందము మీకుఁ గలిగించి నాయంతటి వారిని మిమ్ముఁ జేయవలయునని యే నాయభిప్రాయము నేను సర్వదా కష్టపడుచున్నా ననుచుంటివి. ఎవరినిమిత్తము? నేను బ్రతుకలేకయా? నాయంతట నేనొంటరిగా నుండలేకయా? మీరు మెచ్చుటచే నాకు రాఁగల లాభమేమి? మెచ్చకున్న రాఁగల నష్టియేమి? మీరు నన్నుఁబూజించుట కీర్తించుట నాకు నివేదించుట మీ శ్రేయస్సునకే గాని నా మేలునకుఁ గాదు. నన్నేల నీవు సృష్టించితివనియడిగితివి. మట్టితోను ఱాలతోను గలిసి దేనికిని గొఱగాక పడియుండిన వజ్రములను వెలికిఁదీసి మన్ను ఱాయి పోవఁజేసి సానకువేసి లోకులు తమశిరస్సులధరింప యోగ్యములుగాఁ జేయుట తప్పా? ముద్దగా మూలఁ బడియుండిన బంగారునుదెచ్చి కుంపటిలోవేసి కరఁగించి సుత్తెతోఁగొట్టి పోగరతోఁ జెక్కి యాభరణముగాఁ జేసి స్త్రీలు పురుషులు ధరింపఁదగినవిగాఁ జేయుట కమసాలి దోషమా? అట్టులే వడ్రంగి మొద్దులుగాఁ బడియుండిన చెట్లమొద్దులను దెచ్చి కోసి పలకలుచేసి తో పడా త్రోసి ఉలితో మలిచి చీలలువేసి బిగించి పలకలుగానో బల్లలుగానో కుర్చీలు మంచాలుగానో చేతురు యపహత పాప్మఁడవు, శోకములేనివాఁడవు, ముసలి తనము మరణము లేనివాఁడవు ఆఁకలి దప్పులు లేనివాఁడవు చేతనుఁడవు సత్యకాముఁడవు సత్యసంకల్పుఁడవు నగు నీవు ప్రకృతితోఁ గలిసి రూపనామ క్రియలులేక దుఃఖించుచుండఁగా మీకుఁ బూర్వపు మంచిస్థితి కలిగింపఁగోరి కామక్రోధలోభదాసులయి మీరు వానివలని చెడుఫలములఁ దెలిసికొనలేక క్షుద్రఫలములుగోరి కర్మములు చేయఁగా మీరు కోరిన ఫలములు మీకుఁ గలిగించుచు మీరు పోయినత్రోవనే నేను వచ్చుచుఁ గర్మానుభవము కలిగించుటవలన మిమ్ము బుద్ధిమంతులఁ జేయుచు మంచిదారికిఁ దెచ్చి బాగుపడఁ జేయుట నా తప్పా? పదుగురకు దప్పిదీర మంచినీళ్ళు త్రాగుదురు గాకయని త్రవ్వించిన బావిలో బుద్ధిమాలినవాఁడు పడిచచ్చిన దోషము బావిత్రవ్వించినవానిదా? ఆఁకలిచే బాధపడువానికి భోజనసామగ్రి యిచ్చుచు వంటవండుకొనుటకై నిప్పిచ్చె నేని దానితో వాఁడు దేహము కాల్చికొనినచో దోష మెవరిది? అట్టులే మీరు సత్క ర్మములు చేసి బాగుపడదురుగాక యని దేహమిచ్చితిని. ఇది మంచి యిది చెడ్డదని తెలసికొన జ్ఞానమిచ్చితిని. చేయఁదగినపని చేయరానిపని తెలియుటకై శాస్త్రములు నిచ్చితివి. మీరుకోరినదాని నెఱవేర్ప బద్ధకంకణుఁడనై నేనుంటిని మీరు చెడుకార్యములు చేయుటమాని భారము నాయందువేసి నన్ను నమ్మియుండిన మీకుఁ గావలసిన వన్నియు నేనే యిచ్చెదనంటిని. ఒక్క జన్మమునందే మీకీ సంసారబాధ లేకుండఁ జేయుదు నంటిని. అని యెంతచెప్పినను నామాటయందు మీకు నమ్మకములేక కస్తూరిని విడిచి యమేధ్యమునకై పోవునట్టి యీఁగలవలె కమలములు విడిచి మదపువాసనకై యేనుఁగు చెక్కి ళ్ళమీఁదవ్రాలి చెవిదెబ్బలుదిని నేలఁబడి యల్లాడు తుమ్మెదలవలెనై దుష్టకార్యములు చేసి యాపాపఫల మనుభవింపవలసి వచ్చినపుడు నన్నుఁ దిట్టిననే నేమి చేయఁగలను? ఫలములుగోరి కర్మములు చేసితిని ఆఫలములనుభవించు చున్నావు. శాస్త్రములందు నేను జెప్పిన ప్రకారము మంచికర్మములు చేసినవారు మంచిఫలము లనుభవించుచున్నారు.

నామాటయందు లక్ష్యములేక వారివారి యిష్టప్రకారము చెడు కార్యములు చేసినవారు చెడ్డఫలము లనుభవించుచున్నారు. అది చేయుమనివాఁ డెవఁడు? ఇట్లేడువ మనిన వాఁడెవ్వఁడు? మీరు కోరినవానిని మీకుఁ గలిగించుచున్నానుగాని నేనై స్వతంత్రించి మీకు నేనేదియుఁ జేయుటలేదు. నీవు నేనై స్వతంత్రించి మీకు నేనేదియుఁ జేయుటలేదు. నీవు నాకుఁ గేవల పరతంత్రుఁడవు కావుగదా. నీకుఁగోరికలు గోరు స్వాతంత్ర్య మిచ్చితినిగదా నిన్నెవరు చెడ్డకోరికలు కోరుమనిరి మీరు కోరినవి నే నీయకుండిన నప్పుడు మీరు నన్నేమందురు. అప్పుడును దూషింతురుకదా. మీరు దుఃఖపడుటకు సుఖపడుటకు మీరేకారణభూతులు గాని నేనుగాను. నాయందు రాగద్వేషములు కామక్రోధములు లేవని యనెదవా? నమోనమో ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభూ నమోనమః.

**38.** తండ్రీ! నేను బోయినజన్మమునఁ జేసిన కర్మముల ఫలమీజన్మమున ననుభవించుచున్నా వనెదవుకదా అంగీకరించితిని. నానాలుక నేను గొటికికొని యితరుల దూషించిన లాభమేమి? ఇప్పటిసంగతి

పోనిమ్ము మొట్టమొదట నేనేమికర్మములు చేసితినని నీవు నాకు జన్మములు గలిగించితివి. నే నజ్ఞుఁడను, ఆ ప్రథమకారణము నేను దెలిసికొనలేను. నీవు సర్వజ్ఞుఁడవు కదా, నీవుచెప్పుము. కాలమనాది, కర్మమనాది యని దొంగ నెపములు చెప్పి తప్పించుకొనకుము. అనాది యనునది మేము చెప్పవలసినమాటకాని యనాది గానుండు నీవు చెప్పవలసినది గాదు. నమోనమో ఏకశిలావాసా పాలితవాసుదాసా రామచంద్ర ప్రభూ నమోనమః.

**39.** ఓరీ! యిది తెలిసికొనుటవలన నీకు రాఁగల లాభమేమి? కడుపునొప్పి యెత్తినవాఁడు వాము బొక్క లాడవలయును గాని నేనుదినిన యన్నము పప్పు లోనైనవి యేచేలోఁ బండినవి. ఎప్పుడు పండినవి, విత్తినవా రెవ్వరు, కోసినవారెవ్వరు. అని యిటువంటి ప్రశ్నలచే నీకడుపునొప్పి పోవునా? యందువేమో తండ్రీ! యా విషయము దెలిసిన మరల దానిని దినకుందునుగదా. నమోనమో ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభూ నమోనమః.

**40.** ఓరీ! యటైనఁ జెప్పెదవినుము. ఒక ప్రభువు తనయిష్టులతోడ సంతోషముగఁ గాలము గడుపనెంచి నర్తకిని బిలిపించి నాట్యమాడించెను. సభదీరి యందఱు చూచుచుండిరి. అందు నాట్యమాడిం చెను. సభదీరి యందఱు చూచుచుండిరి. అందు వివేకులగువారు దాని యభినయములు దాని యాటచూచి దీనివలలోఁ బడితిమా చెడుదుమని తలఁచి ప్రభువునే యాశ్రయించి ప్రభువునందే భక్తిగలవారై యుండిరి. కొందఱాయాటచూచి మెచ్చుకొని వహ్వా! దీనియందింకను నెంత విద్యకలదో అల్పకాలములోనే యింత వినోదముచూపి సంతోషింపఁజేసెనే దీనిని మనము వశపఱిచి కొనిన నెంత సుఖసంతోషములైన ననుభవింపవచ్చునని మాయా మృగము చర్మముమీఁది యాశచే రామచంద్రమూర్తిని సీతాదేవి వదలినట్లు ప్రభుభుక్తివదలి దానికి వశపడి దానియందుఁ గామముచేఁ ధన్మయత గలవారైరి. వేశ్య తనకు వశపడిన కాముకుల నెట్లు చేయవలెనో యట్లే యదిచేసెను. మరలఁ బ్రభువునొద్దకుఁ బోకుండునట్టు లాయనను స్మరింపకుంటునట్లు తన వలలోఁ జిక్కి ంచుకొని వారి నాడింపసాగెను. వారును దమ పూర్వ స్థితిని మఱచిరి. ఇట్లు చెడినవారుండుట నీ వెఱుఁగుదువుకదా. అట్టులే జీవకోటిసభలోఁ బ్రకృతియనువేశ్య నాడించి తిని దాని మాయలకుఁ గొందఱు లోపడక నాయొద్దనే నిలిచిరి. వీరే నిత్యసూరులు, దానిమాయకు లోపడి యది యాడించినట్టు లాడువారే బుద్ధులు. ఆవేశ్యతోడి సాంగత్యమువలనఁ దమకుఁ గలిగిన సుఖహాని కష్టప్రాప్తి యనుభవముచేఁ దెలిసికొని తమదోషములు నాతోఁ జెప్పుకొని దానిబాధ తొలఁగింపు మనికోరఁగా వారి కోరిక నెఱవేర్చితిని వారే ముక్తులనఁబడువారు. మీకు జ్ఞానముండియు నాయందు భక్తితొలఁగుటయే మీ కీ జన్మములు గలుగఁ గారణమయ్యెను. మరల నాయందే మీకెప్పుడు భక్తి కలుగునో యప్పుడు ప్రకృతి మిమ్ముల వదలిపోవును తరువాత మునుపటివలె నాయొద్దకువచ్చి శాశ్వతసుఖమ నుభవింతురు. ఇప్పుడైనను నీవుబుద్ధిమంతుఁడవై ప్రపన్నుఁడ వేతివేని యీ జన్మమందే ముక్తుఁడ వయ్యెదవు. భయపడవలదు, వ్యసన పడవలదు, నేను నీకిచ్చిన స్వాతంత్ర్యము దుర్విని యోగ పఱుపక సద్వినియోగము చేయుము అనెదవా? నమోనమో ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభూ నమోనమః.

**(సశేషము).**

## భక్తివిజయము.

**(గతసంచికాశేషము 189వ పుట చూడు.)**

ఇట్టి నిధిధ్యాసనమునకుఁ గాను **"ద్వేవావ బ్రహ్మణోరూపే"** అను శాస్త్రము పరబ్రహ్మముయొక్క స్వరూపమును గుఱించి యుపదేశిచుటకై యుద్దేశించి, ప్రమాణాంతరా వేద్యమగు మూర్తామూర్త విశిష్టత్వ మును ఉపదేశించుచున్నది కావున నట్టి స్వరూపము ప్రకృతశ్రుతిచే ననువదింపఁబడుచుండలేదు. ఆంధ్రశ్రీభాష్యము.

శ్రీనింబార్కా చార్యులవారును.

శ్రుతి స్మృతులవలన బ్రహ్మసాక్షాత్కా రము భక్తి పూర్వజ్ఞానముచేతనే కలుగును అని వ్రాసి ప్రమాణముగ మీఁద నుదహరించిన "జ్ఞానప్రసాదేన – భక్త్యా త్వనన్యయా" అను శ్లోకముల నుదాహరించిరి.

శ్రీశుకభాష్యమందు,

సంరాధనమ్ = శ్రవణకీర్తనధ్యాన పాదసేవనార్చనాది లక్షణ యోగానుష్ఠానమ్ – అని కలదు.

శ్రీ విశిష్టాద్వైత భాష్యందు, (వైఖానస).

ఆరాధనేన వినాకేనాపి ప్రకారేణాయమాత్మానలభ్యతే ఆరాధనేనైవ లభ్యతే, భక్త్యా భగవంతం శ్రీమన్నారాయణ మర్చయేత్ । తద్విష్ణోః పరమంపదం గచ్ఛతీతి విజ్ఞాయతే” ఆరాధనముచేఁదప్ప మఱియే విధముచేనైనను ఆత్మలభింపదు. ఆరాధనముచేతనే లభించును భక్తిచే శ్రీమన్నారాయణు నర్చింపవలెను. అట్టివాఁడు విష్ణుదేవుని పరమపదమునకుఁ బోవును.

ఇఁక శ్రీశంకరాచార్యులవా రేమి వ్రాసిరో చూతము. అపిచైన మాత్మానం నిరస్త సమస్తప్రపంచ మవ్యక్తం సంరాధనేకాలే పశ్యంతి యోగినః సంరాధనంచ భక్తిధ్యాన ప్రణిధానాద్యనుష్ఠానమ్.

నిరస్తసమస్త ప్రపంచమును అవ్యక్తమునగు ఆత్మను సంరాధనకాలమందుఁ జూతురు. సంరాధన మనఁగా భక్తి ధ్యాన ప్రణిధానాద్యనుష్ఠానము” అని వ్రాసిరి. ప్రణిధానము = ఆత్మనిక్షేపము = ఆత్మనివేదనము.

దీనికి వేద ప్రమాణముగ “జ్ఞాన ప్రసాదేవ విశుద్ధసత్త్వస్తతస్తుతం పశ్యతే నిష్క లంధ్యాయమానః దీనికర్థము బ్రహ్మ శ్రీ కనుపర్తి మార్క ండేయ శర్మగారిట్లు వ్రాసిరి. జ్ఞానప్రసాదముచే నిర్మలాంతఃకరణము గలవాఁడు మాత్రమే సర్వావయవ భేదవర్జితముగా సత్యాది సాధనములచేత ఇంద్రియముల జయించిన యేకాగ్రచిత్తముతో ఆత్మను ధ్యానము చేయుచు ఆయాత్మ తత్త్వము నవలోకింపఁగలఁడు. ఇచ్చట ధ్యానము ఆత్మసాక్షాత్కా రమునకు సాధనముగఁ జెప్పఁబడెను.

ఈ సూత్రమునకు ముందు వెనుక సూత్రములను బరిశీలించినఁగాని యీ సూత్రార్థము పూర్ణముగ బోధపడదు. దీనికిముందు-

**తదవ్యక్త మాహహి ॥ 3-2-23.**

ఇది పరమాత్మ యింద్రియములకు గోచరుఁడు కాఁడని తెలుపుచున్నది. అట్లు బొత్తిగా గోచరుఁడే కాక పోయిన పక్షమునం దాయన యున్నాఁడని యెట్లు నమ్మవచ్చుననిన :

**అపిసంరాధనే ప్రత్యక్షానుమానాభ్యామ్. 3-2-24.**

ఇతరవిధముల గోచరింపఁడు గాని భక్తిచే గోచరించును. దీనికి శ్రుతి స్మృతులు ప్రమాణములని చెప్పఁబడెను.

అట్లెట్లు చెప్పవచ్చును. మనప్రయత్నముచే నాయన గోచరించునా? ఆప్రయత్న మొకసారిచేసినఁ జాలునా? యనిన :

**ప్రకాశాది వచ్చా వైశేష్యం**
**ప్రకాశశ్చ కర్మాణ్యభ్యాసాత్ 3-2-25.**

ప్రకాశముగల పదార్థములవలె ననఁగా నొకకుండలో నీళ్ళుంచిన సూర్యుఁడు దానిలోఁ గానవచ్చి నట్లు మీఁదఁ జెప్పిన యారాధనమను కర్మము నభ్యసించుటచే (పలుమాఱు చేయుటచే) పరమాత్మయు మనహృదయమందు గోచరించునని భావము. ఇందుఁ గర్మము నభ్యసించుట యనునది వారి మతవాదము నకు విరుద్ధము కావున దానికి వ్యాఖ్యవ్రాయక విడిచిరి.

It certainly looks here as if the Bhashya Kara did not know what to do with the words of the Sutra. The 'Karmani' which is as good as passed over by him.........." (Vedanta Sutras Sankara's Commentary page 172, Vol. II.)

ఒక వేళ నది స్పష్టము గావున వ్రాయలేదని సమాధానము చెప్పదరేని యప్పుడది యంగీకరించి నట్టులే కదా. అది యెట్టులైన నగునుగాక మనకుఁ బ్రస్తుతమునఁ గావలసినది యవ్యక్తుఁడగు పరమాత్మ భక్తిచేతనే సాక్షాత్కా రించునుగాని మఱియేసాధనముచేఁ గాదని శ్రుతి స్మృతి బ్రహ్మసూత్రములవలన స్థిరపడెను.

**ప్రశ్న :-** ఓయి! నీవు భక్తిపరుఁడవి వ్రాసిన శ్రీమధ్వాచార్యులవారే **‘అపి సంరాధనే’** యను సూత్రమునకు ఆరాధనము చేసినను బరమాత్మ కనఁబడఁడు’ అని వ్రాసిరిగదా.

**ఉత్త :-** నీవు చెప్పినది వాస్తవమే. వారిమాటల కభిప్రాయము భక్తి వ్యర్థమనికాదు నేను భక్తిచేతనే భగవత్సాక్షాత్కా రము పొందెద ననిచెప్ప నధికారము లేదనియు నది భగవత్కృపవలననే వచ్చుననియుఁ గావున ముఖ్యకారణము భగవత్కృపగాని పురుష ప్రయత్నము కాదనియు వారియభిప్రాయమై యుండవలెను. వారు భక్తివ్యర్థమని వ్రాసినచో దాని స్థానమున నుపాయాంతరము చెప్పవలయునుగదా చెప్పలేదే. అంతియే గాక భగవత్కృప తనంతటఁదానే రావలయును. మన ప్రయత్నము వ్యర్థమని తిని కూర్చుండరాదు. మనకర్తవ్యము మనము చేయవలెను. మానరాదు. అనిన శ్రీమధ్వాచార్యులవారే **‘ప్రకాశశ్చ కర్మణ్యభ్యాసాత్’॥**

3-2-26. కర్మలకు విషయభూతుఁడైన పరమాత్మను గుఱించి శ్రవణాదులను అభ్యాసముచేయుటవలన భగవద్దర్శనము కలుగునని వ్రాసిరి. దీనివలన నీసందేహము తీఱఁగదా వారు వ్రాసినది యహంకర్తృత్వాభిమానములతో నుపాసనము చేయవలదనియే. భక్తి మతమువా రెవ్వరును నుపాసనము వలదని వ్రాయరు.

ఈ భక్తి విషయమున మఱికొన్ని ప్రమాణవాక్యము లుదాహరించెదను.

**“తస్మాత్సర్వేషా మధికారిణా మనధికారిణాం భక్తి యోగ ఏవప్రశస్యతే। భక్తియోగో నిరుపద్రవః భక్తి యోగాన్ముక్తిః। బుద్ధిమతా మనాయా సేనాచిరాదేవ తత్త్వజ్ఞానం భవతి। తత్క థమితి భక్తవత్సలః స్వయమేవ సర్వేభ్యో మోక్షవిఘ్నేభ్యో భక్తినిష్ఠా పరిపాలయతి। సర్వాభీష్టాన్ ప్రయచ్ఛతి। మోక్షందావయతి। చతుర్ము ఖాదీనాం సర్వేషా మపి వినాభక్త్యా కల్పకోటిభిర్మోక్షో నవిద్యతే। కారణేన వినా కార్యంనోదేతి। భక్త్యా వినా బ్రహ్మజ్ఞానం కదాపి నజాయతే తస్మాత్త్వమపి సర్వోపాయాన్ పరిత్యజ్య భక్తి మాశ్రయ। భక్తి నిష్ఠోభవ భక్త్యా సర్వసిద్ధయ స్సిద్ధ్యంతి। భక్తేరసాధ్యం నకించిదస్తి ॥ మహానారాయణోపనిషత్తు.**

**అర్థము.**

ఆకారణముచే నధికారులైనవారికి నధికారులు కానివారికి భక్తియోగమే ప్రశస్తము, భక్తి యోగము నిరుపద్రవము, భక్తియోగమువలన ముక్తి, బుద్ధిమంతులకు ననాయాస ముగ శీఘ్రకాలమందే తత్త్వజ్ఞానము కలుగును. అది యెట్టులనిన భక్తవత్సలుఁడు తానే మోక్షవిఘ్నముల నన్నిటినుండి భక్తి నిష్ఠులను రక్షించును, సమస్తములైన కోరికల నిచ్చును. మోక్షము నొసఁగును, చతుర్ముఖబ్రహ్మ మొదలగువారి కందఱకు విష్ణు భక్తివిడిచిన కోటికల్పముల కైనను మోక్షములేదు. కారణములేక కార్యము పుట్టదు, భక్తిలేక బ్రహ్మజ్ఞాన మెన్నఁటికి గలుగదు. కావున నీవును సర్వోపాయముల వదలి భక్తినాశ్రయింపుము. భక్తినిష్ఠుఁడవు కమ్ము. భక్తిచే సర్వసిద్ధులు కలుగును. భక్తిచే సాధింపరాని దేదియులేదు.

అథాశ్వలాయనో భగవంతం పరమేష్ఠినం పరిసమేత్యోవాచ। అధీహి భగవన్ బ్రహ్మవిద్యాం పరిష్ఠాం సదాసద్భిః సేవ్యమానాం నిగూఢామ్। యయాఽ చిరా త్సర్వ పాపం వ్యపోహ్య పరాత్పరం పురుష ముపైతి। విద్వా తస్మై సహోవాచ పితామహశ్చ శ్రద్ధాభక్తి ధ్యానయోగాదవేహి ॥ కైవల్యోపనిషత్తు.

అశ్వలాయనుఁడు భగవంతు బ్రహ్మను బ్రదక్షిణించి యిట్టు లడిగెను. భగవంతుఁడా! సర్వదా సజ్జనుల సేవించునదియు రహస్యమైనదియు శ్రేష్ఠమైనదియు నగు బ్రహ్మవిద్యను జెప్పుము. దేనిచే శీఘ్రముగ సమస్తపాపములు తొలఁగి విద్వాంసుఁడు (జ్ఞాని) పరాత్పరుఁ బురుషుఁ బ్రాపించునో యట్టిదానిఁ దెలుపుము. ఆయనకుఁ బితామహుఁ డిట్లు చెప్పెను. శ్రద్ధ చేతను భక్తిచేతను ధ్యాన యోగమువలనను ననిదెలిసికొనుము.

**నాయమాత్మా ప్రవచనేనలభ్యో**
**నమేధయా నబహునా శ్రు తేన**
**యమేవైష వృణుతే తేనలభ్య**
**స్తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్ — కఠోపనిషత్తు.**

ఈ యాత్మవేదాధ్యయనము చేతను, బుద్ధిచేతను విశేషము వినికిడిచేతను లభింపదు.

అది యెవనివరించునో (ఎవఁడు దానిని వరించునో) వానికి లభించును వానికిఁ దనరూపము కనఁబడఁజేయును.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం**
**యోవైవేదాగ్ంశ్చ ప్రహిణోతి తస్మై**
**తగ్ ంహ దేవ మాత్మ బుద్ధిప్రకాశం**
**ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే. — శ్వేతాశ్వతర.**

ఎవఁడు పూర్వము బ్రహ్మము సృష్టించి యాయనకు వేదము లిచ్చెనో యాత్మబుద్ధి ప్రకాశమగునట్టి వానిని మోక్షార్థినై శరణు చొచ్చెదను.

**సాతుకర్మ జ్ఞానయోగేభ్యో ప్యధికతరా**

అది (భక్తి) జ్ఞానముకంటెను కర్మముకంటెను యోగము కంటెను శ్రేష్ఠమైనది.

**తస్మాత్సైవ గ్రాహ్యా ముముక్షుభిః**

కావున మోక్షాసక్తులగు వారిచే నదియే సాధింపఁబడవలెను.

**తదేవసాధ్యతామ్ తదేవసాధ్యతామ్**

దానినే సాధింపవలెను, దానినే సాధింపవలెను.

**యోగినామపి సర్వేషాం, మద్గతే నాంతరాత్మనా**
**శ్రద్ధావా భజతేయో మాం, సమేయుక్త త మోమతః. భ.గీ. 6-47.**

యోగులందఱిలో నాయందుంచఁబడిన మనస్సుగలవాఁడై శ్రద్ధతో నెవఁడు నన్ను భజించునో వాఁడా యందఱు యోగులకంటె శ్రేష్ఠుఁడు.

ఇట్టి ప్రమాణ వాక్యములు వందలకొలఁది గలవు. కావున మోక్షసాధనములలో భక్తియే శ్రేష్ఠమనుట సర్వశాస్త్ర సమ్మతము.

గీతారహస్యము.

"కాని బ్రహ్మప్రాప్తిని గుఱించి సాధన భూతములైన యేయే గుహ్యవిద్యలు, లేక మార్గములుగలవో యవి యనేకములున్నను వాని యన్నింటిలోను గీతలయందున్న భక్తి మార్గరూపమగు విద్యయే **యనఁగా : సాధనమే శ్రేష్ఠము.** (విద్యానాంచ, గుహ్యానాంచ రాజా). కారణమేమి **యన :** జ్ఞానమార్గమందలి విద్యవలె నది '**యవ్యక్తము**' కాక, నేత్రములకుఁ బ్రత్యక్ష్యముగఁ గాన్పించునదిగ నున్నది. మఱియు నందువలన దానియొక్క యాచరణమును సుఖముగఁ జేయవచ్చును అని మామతమునందు పైశ్లోకమునకు భావార్థకముగ నున్నది'... గీతయందున్న మాధుర్యము, ప్రేమ, లేక, రసపూర్ణత యనునది దానియందుఁ బ్రతిపాదింపఁబడిన భక్తి మార్గముయొక్క పరిణామమే యై యున్నది. పరమేశ్వరుని యొక్క ప్రత్యక్షావతారమైన శ్రీకృష్ణుఁడే మొదటి గీతాధర్మములఁ జెప్పువాఁడు, మఱియు దానిలోను, అజ్ఞేయమగు పరబ్రహ్మముయొక్క శుష్క జ్ఞానమును జెప్పక" .......... పు.576.

....భక్తిమార్గము పూర్ణముగ స్థాపింపఁ బడినదని నిర్వివాదముగ సిద్ధమగుచున్నది....

* * *

ప్రాచీనోపనిషత్తులలోఁ జెప్పఁబడిన సగుణోపాసననుండియే మనలో భక్తిమార్గము క్రమ క్రమముగ బయలువెడలినది. పాతంజలయోగమునందు చిత్తస్థైర్యమును సంపాదించుకొనుట కేదియో యొకవ్యక్తమును, ప్రత్యక్షమునగు వస్తువును కన్నులయెదుట నుంచుకొనవలయును గాన, దానిని బట్టి భక్తిమార్గమునకు రెండుబలములు గలిగినవనియు, భక్తిమార్గమే యితర దేశములనుండి హిందూదేశమునకు రాలేదనియు, నట్లు రానక్క ఱలేదనియు గీతారహస్యములో నుండు వివేచనవలన స్పష్టముగఁ దెలియును. హిందూ దేశమున నిటులు వెలువడిన భక్తిమార్గమును, మఱియు విశేషముగ వాసుదేవభక్తిని, ఉపనిషత్తులయందున్న వేదాంత దృష్టితో సమర్థించుట యనునది గీతలలో నుండు ప్రతిపాదనలో నొక విశేషభాగముగ నున్నది.

**"తస్మాన్మామేకగ్ం శరణం వ్రజ మద్భక్తి నిష్ఠోభవ । మదీ యోపాసనాం కురు । మామేవ ప్రాప్స్యసి । మద్వ్యతిరిక్తగ్ం సర్వం బాధితం । మద్వతిరిక్త మబాధితం నకించిదస్తి । నిరతి శయానందా ద్వితీయోహమేవ । సర్వపరిపూర్ణోహమేవ । సర్వాశ్రయోహమే వ్యవాచామ గోచర నిరాకార పరబ్రహ్మ స్వరూపోహమేవ । మద్వ్యతిరిక్త మణుమాత్రం నవిద్యతే । ఇత్యేవం మహావిష్ణోః పరమిదముపదేశం లబ్ధ్వా । పితామహః పరమానందం ప్రాప । విష్ణోఃక రాభి మర్శనేన దివ్యజ్ఞానం ప్రాప్యపితామహస్తత స్సముత్థాయ ప్రదక్షిణ నమస్కా రాన్ విధాయ వివిధోపచారైర్మహావిష్ణుం ప్రపూజ్య । ప్రాంజలిర్భూత్వా వినయే నోపసంగమ్య భగవన్ భక్తి నిష్ఠాంమే ప్రయచ్ఛ ।" మహానారాయణోపనిషత్తు. 8 అ.**

అద్వైతసన్న్యాసి మధుసూదన సరస్వతులు సర్వధర్మాన్ పరిత్యజ్య యను చరమశ్లోకమునకు వ్యాఖ్య యందు నిట్లు వ్రాసియున్నారు. పరమార్థచంద్రికయందలి తెలుగు–

"సమస్తములయిన ధర్మములను శరణమని యాదరింపకము అన్యనిరపేక్షమగు భగవ దనుగ్రహము వలననే నేను గృతార్థుఁడ నగుదునని నిశ్చయంబునఁ బరమానంద ఘనమూర్తిని అనంతుని శ్రీవాసుదేవునే భగవంతుని అను క్షణ భావనచే భజింపుము. ఇదియే పరమతత్త్వము ధర్మపదము కర్మ మాత్రపరమనుట నిరాకృతము. ఇట కర్మత్యాగము విహితముకాదుగదా. ఇదియు సన్న్యాస శాస్త్రంబనఁదగదు భగవదేక శరణతను విధించుట యిష్టంబనుటవలన సర్వశాస్త్రములయుఁ బరమరహస్యం బీశ్వరశరణతయే కావున దానియందే శాస్త్రపరిసమాప్తి భగవంతునిచేఁ జేయఁబడినది.' ఇది శంకరాభిప్రాయముతో విరోధించుచున్నది. భగవత్సాక్షాత్కా రానంద వైభవము భక్తులసొత్తు – అద్వైత జ్ఞాననిష్ఠుల కది గగనకుసుమము.

## భక్తి సర్వసామాన్యము.

కర్మయోగ మనఁగా వర్ణాశ్రమపద్ధతుల ననుసరించి శాస్త్రీయమైన కార్యములను యథావిధి చేయుట. ఇట్టి కర్మములం దధికారము యథావిధి చేయుట. ఇట్టి కర్మములం దధికారము బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య పురుషలకు మాత్రమే కలదు. స్త్రీ శూద్రాదులకు లేదు. కావునఁ గర్మయోగ ప్రకారము స్త్రీ శూద్రాదులు యథా ప్రకారము పడియుండవలసిన వారే.

ఇఁక జ్ఞానయోగమందమా యనిన శంకరమత ప్రకారము బ్రాహ్మణసన్న్యాసి పరమహంస పరివ్రాజ కునకుఁ దప్పఁ దక్కి నవారి కెవ్వరికి దానియందు నధికారములేదు. ఇతర మతముల ప్రకారము చూచినను సన్న్యాసమునకు క్షత్రియాదు లధికారులుగారు అష్టాంగయోగ మనిన జాతిచే నందఱు నధికారులే కాని బాలురు, వృద్ధులు, అనారోగ్యవంతులు లోనగువా రర్హులుగారు.

ఇఁక భక్తి (ప్రపత్తి) యనిన దానిని సాధించుటకు బాలురు వృద్ధులు యౌవనవంతులు స్త్రీలు పురుషులు అన్ని వర్ణములవారు నధికారులే. భక్తి యొకరిసొత్తుకాదు. భగవంతునియందుఁ బ్రేమగల యెల్లవారిసొత్తు. ధ్రువుఁడు ప్రహ్లాదుఁడు బాలభాగవతులు, అందుఁ బ్రహ్లాదుఁడు రాక్షసుఁడు. విభీషణుఁడు వృత్రాసురుఁడు రాక్షసులు. ద్రౌపది బ్రాహ్మణస్త్రీలు గోపికలు శబరి మొదలగువారు స్త్రీలు. శబరి గుహుఁడు బోయవారు. విదురుఁడు శూద్రుఁడు. వానరులు కరిరాజు మృగములు. నూలయోబఁడు నందనారు తిరుప్పాణి యాళ్వారులు మాలవాండ్రు. నారదాదులఁ జెప్పవలసినదేలేదు. వీరందఱు భక్తినిష్ఠగలవారే.

**మాంహి పార్థవ్యపాశ్రిత్య । యేపిస్యుః పాపయోనమః**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రా । స్తేపి యాంతిపరాంగతిమ్**

అర్జునా! నన్నుఁ జక్కఁగ నాశ్రయించినవారు స్త్రీలైనను వైశ్యులయినను శూద్రులయినను మహాపాపు లైనను బరమగతికిఁ బోదురు.

**అపిచేత్సుదురాచారో, భజతే మామనన్యభాక్**
**సాధురేవ సమంతవ్యః, సమగ్వ్యవ సితోహి నః ॥**
**క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి**
**కౌంతేయ ప్రతిజానీహి, నమేభక్తః ప్రణశ్యతి ॥ 9-30-31.**

అనాచార దురాచారములు గలవాఁడైనను వేఱు ప్రయోజనము కోరక నిరంతరము నాభజనమే యెవఁడు సేయునో వాఁడు చక్క ని నిశ్చయము గలవాఁడు కావున వాఁడు సాధువే. వారిని హీనజాతుల వారని నిరాకరింపరాదు. అటువంటి ధర్మాత్ముఁడు శీఘ్రకాలమునందే శాశ్వతముగ మత్ప్రాప్తివిరోధనిరోధ ములు లేనివాఁడగుచున్నాఁడు. ఆకారణమున ముక్తుఁడగుచున్నాఁడు. అర్జునా! ప్రమాణము చేసి చెప్పెదను. నాభక్తుఁ డేనాఁటికిని జెడఁడు. 'సాధురేవ సమంతవ్య' యని భగవంతుఁడే చెప్పిన కారణముచే నెవని యందు నిజమైన భక్తి స్థిరపడినదో, భక్తిలక్షణములు గలవాఁడగుచున్నాఁడో వాఁడు బ్రాహ్మణువలె గౌరవింపఁ దగిన వాఁడు. తక్కి నజాతి శూద్రులను జూచిన దృష్టితో నతనిఁ జూడరాదని వైష్ణవ సిద్ధాంతము. ఆ మత ప్రకారము నిజమై దృఢమైన విష్ణుభక్తిగలవాఁడు శూద్రుఁడైనను బ్రాహ్మణతుల్యుఁడే. ఆహారములందు వివాహములందు బ్రాహ్మణత్వము లేదుగాని తక్కి నవిషయముల వాఁడు బ్రాహ్మణ సముఁడే స్పర్శదోషము మొదలయిన దోషములు వానియందు లేవు. కావుననే **మద్భక్త జనవాత్సల్యం పూజాయాం చానుమోదనమ్, మత్క థాశ్రవణేభక్తిః, స్వరనేత్రాంగవిక్రియా । స్వయమారాధనే యత్నో, మమార్థే దంభవర్జనమ్ । మమాను స్మరణమ్ నిత్యం, యచ్చమాం నోపజీవతి । భక్తిరష్టవిధాహ్యేషా, యస్మిౕ మ్లేచ్ఛేపివర్తతే, సవిప్రేంద్రో మునిశ్శ్రీమా నయతిస్సచపండితః తస్మైదేయం తతోగ్రాహ్యం సచపోజ్యోయథాహ్యహమ్.**

నాభక్తులను దనబిడ్డలవలెఁ బ్రేమించుట, వారుచేయుదేవపూజ నామోదించి వారికిఁ గావలసిన సాహాయ్యము చేయుట నాకథలు వినుటయందుఁ బ్రీతి నావిషయము చెప్పునపుడు వినునపుడు దగ్గుత్తిక, గగ్గురుపాటు, కన్నీరు లోనైన స్వర, నేత్ర, అంగవికారములు గలుగుట, తాను భగవదారాధనము చేయ యత్నించుట, నా విషయమున వంచనలేక వర్తించుట, నన్నెల్లప్పుడు స్మరించుట, నన్ను విడిచి బ్రతుకలేకుం డుట. ఈ యెనిమిది విధములైన భక్తిచిహ్నము లెవనియందుండునో వాఁడు మ్లేచ్ఛుఁడైనను బ్రాహ్మణుఁడే, వాఁడు మునియే, వాఁడు శ్రీమంతుఁడే, వాఁడు యతియే, వాఁడే పండితుఁడు. వానికి దానమీయవచ్చును, వానిచేఁబుచ్చుకో వచ్చును, నావలె వాఁడును బూజ్యుఁడగును. ఇట్టి వాఁడైయుండవలె ననినఁ దీరికయున్నప్పు డెప్పుడో కొంతసేపు భజనము చేసినఁజాలదు. ఇట్టివాఁడు భక్తిమార్గమున నడుగు పెట్టిన వాఁడేకాని

భక్తుఁడను గొప్పపేరు వహించి నర్హుఁడుకాఁడు. ఇట్టివాని లక్షణము లేవనిన :-

**ఆద్యంతు వైష్ణవం ప్రోక్తం శంఖచక్రాంకనంహరేః**
**ధారణం చోర్ధ్వ పుండ్రాణాం, తన్మంత్రాణాం పరిగ్రహః**
**అర్చనంచ జపంధ్యానం, తన్నామ స్మరణం తథా**
**కీర్తనం శ్రవణంచైవ వందనం పాదసేవనమ్**
**తత్పాదోదకసేవాచ తన్నివేదిత భోజనమ్**
**తదన్యానామసేవాచ, ద్వాదశీవ్రతనిష్ఠితా.**
**తులసీరోపణం విష్ణో ర్దేవ దేవస్య శార్ఙ్గిణః**
**భక్తిష్షోడశథాప్రోక్తా, భవబంధ విముక్తయే॥ పద్మ.**

వైష్ణవత్వమునందు మొదదటిది శంఖచక్ర చిహ్నములు ధరించుట, ఊర్ధ్వపుండ్ర ధారణము, నారాయణ మంత్రోచ్చారణము, అర్చనము, జపము, ధ్యానము, నామస్మరణము, కీర్తనము, శ్రవణము, వందనము, పాదసేవనము, విష్ణుపాదోదకపానము, భగవంతునకు నివేదించినది భుజించుట, ఇతరుల దేవతల సేవింప కుండుట, ద్వాదశీవ్రతనిష్ఠ, విష్ణువునకుఁదులసి సమర్పించుట, (తులసి చెట్లువేసి పెంచుట). ఈ పదునాఱు విధములైన భక్తి జనన మరణబాధ తప్పించును. ఇట్టివాఁడు వైష్ణవుఁడు మీఁదఁ జెప్పఁబడినది యట్టివాని విషయమే.

**శ్లో. యశ్శూద్రం భగవద్భక్తం నిషాదం శ్వపచంతథా**
**వీక్షతే జాతిసామాన్యా త్సయాతి నరకం నరః ॥**

మీఁదఁ జెప్పఁబడిన గుణములు గలవాఁడు జాతిచే బోయవాఁడైనను మాలవాఁడైనను వానిని దక్కి న యాజాతి వారిని జూచినట్టు చూచువాఁడు నరకమునకుఁ బోవును. ఇట్టి వాని విషయమే భగవంతుఁడు.

**(సశేషము.)**

## కలికాల చిహ్నములు.

### నెత్తురువాన.

గోరకుపూరు జిల్లాలోని యొక గ్రామములో 20-4-34 తేది రాత్రివేళ రెండు ఎకరముల మేర నెత్తురువాన కురిసిన దనియు నుదయమునఁ జూడఁగా భూమియంతయు నెఱ్ఱగా నుండి రక్తబిందువులు గానవచ్చుచుండెననియు, పోలీసు ఇన్‌స్పెక్టరు, పట్వారీలు పరిశీలించి నెత్తుటితోఁ దడిసిన మన్నురసాయనిక పరిశోధననిమిత్తము పంపిరనియు 20-4-34 తేది గల హిందూదైనిక వ్రాయుచున్నది. రామరావణ యుద్ధకాలమున రాక్షససేనయందిట్లే జరిగెనని రామాయణమునఁగలదు.

### దేవాలయము తలుపులు తమంతట మూయఁబడుట.

గురుదాసపూరు జిల్లా బటాలా అనుచోట రాధాకృష్ణ దేవాలయమున మంగళవారమునాఁ డర్చకుఁడు పూజచేయుటకు లోపలికిఁ బోయిన కొంతసేపటికిఁ దలుపులుఁ దమంతటఁదామే మూసికొనెననియు గడియలుగాని గొళ్ళెములుగాని వెలుపలగాని లోపలగాని వేయఁబడలేదనియు బయటివా రెందఱు ప్రయత్నించినను తలుపులుతీయ సాధ్యపడలేదనియు ఒక భక్తుఁడు తాఁకిన వెంటనే తలుపులు తమంతటఁ దామే తెఱచుకొనె ననియు 21-4-1934 హిందూపత్రిక వ్రాయుచున్నది.

### క్రీస్తువిగ్రహమునకు నెత్తురుకాఱుట.

ఇటలీ రోమన్ కాథలిక్కు లకుఁ బ్రధానస్థానము. వీరు విగ్రహారాధకులు. ఇటలీలోని అస్తియను ప్రదేశమందలి యీ మతమువారి మఠమునందలి క్రీస్తు విగ్రహమునకు చిలువ వేయఁబడిన గాయమునుండి రక్తము కాఱెననియు నిట్లు రెండు పర్యాయములు జరిగినదనియు యామఠాధిపతి యా రక్తమును బరిశోధ నార్థము పంపఁగా నది మనుష్యరక్తమే యని నిర్ధారణమైనదనియు, జనులు గుంపులు గుంపులుగాఁబోయి చూచుచున్నారనియు (ఇండియన్ మిఱ్ఱర్) పత్రిక వ్రాయుచున్నది.

మన దేశమునందుకూడ నిట్లే యొకచోట హనుమంత విగ్రహము ఏడ్చెననియు, మఱియొక చోట రాధాకృష్ణ విగ్రహములు కన్నీరు గార్చెననియు పత్రికలయందుఁ బ్రకటింపఁ బడియుండెను.

**భక్తిసంజీవనీ కృతార్థత.**

లోకము బాగుపడుటకు భక్తిమార్గమునకు మించిన సులువై సునిశ్చతప్రదమయినది మఱొక్క టి లేదని భక్తిసంజీవని బోధించుట యంధ్రలోక మెఱించినదేకదా. సనాతనధర్మ విధ్వంసన మొనరించుచు దేశము నుల్లల నుడికించుచున్న విపరీతాచరణములకుఁ గారణము భక్తిలేమియే. నేఁటికిఁ గొందఱద్వైత మతాచార్యులును ధర్మరాజ్యము మొదలగు సనాతన ధర్మప్రబోధక పత్రికలును భక్తికన్న వేఱుగతి లేదని యుపదేశించుట దేశాభ్యుదయ సూచకము. భక్తిసంజీవని తానుజేయుచున్న కృషి ఫలోన్ముఖ మగుటవలనఁ కృతార్థతఁ జెంది సంతసించుచున్నది.

**శ్రీ వాసుదాస సంచారము.**

శ్రీ వాసుదాస స్వాములవారు ఏప్రిల్ నెల 30వ తేది లక్ష్మీనరసాపురమువదలి తూర్పుగోదావరి శ్రీ కోదండరామ సేవకసమాజ వార్షికోత్సవమునకై మేనెల 6వ తేదివఱకు మండపేఁటయందుండి, యందుండి కోరుకొండకు పోవుదురు. ఇట్లే మఱికొన్ని గ్రామములు చూచి మే నెల 31వ తేది యొంటిమిట్ట చేరుదురు. కాలవిరామము లేకుండుటను, చాలినంత తోడులేకుండుటను, జైత్రయాత్ర ప్రకృతము నిలుపవలసి వచ్చెను.

**యా. వెం. సుబ్బదాసుఁడు.**